క్లుప్తంగా

రంజాన్ ప్రార్థనలకు సర్వం సిద్ధం



చిలకలూరిపేట: రంజాన్ పండుగను పురస్కరించుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్‌లో ఈద్గా మైదానం వద్ద పారిశుద్ధ్య పనులను ఆదివారం నిర్వహించారు. ఈద్గా మైదానంలో నమాజు కోసం వేలాదిగా ముస్లింలు హాజరుకానున్నారు. ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, ముస్లిం పెద్దలు పరిశీలించారు. సోమవారం ఉదయం 8 గంటలకు ముఫ్తీ ఖలీల్‌ఖాన్ రంజాన్ సందేశం (బయాన్) ఇస్తారని, 9 గంటలకు నమాజ్ ఉంటుందని అంజుమన్ ఇస్లామియా కార్యదర్శి షేక్ అహ్మద్ తెలిపారు.

గోశాల నిర్మాణానికి శంకుస్థాపన



వినుకొండ: పట్టణంలోని కొండమెట్ల వద్ద వేంచేసి ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఉగాది పండుగ సందర్భంగా శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ చైర్మన్ లీలావతి చేతుల మీదుగా గోశాల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. పండుగ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సేవకులు జాజుల మాల్యాద్రి, ఎం. నరసింహారావు, కృష్ణ, పీవీ సురేష్, నిశ్శంకరరావు శ్రీనివాసరావు, ఉష, భక్తులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతికి సంతాపం



యడ్లపాడు: క్రైస్తవ మత బోధకుడు పాస్టర్ పగడాల ప్రవీణ్ కుమార్ ఆత్మకు శాంతి కలగాలని క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామంలోని లూథరన్ చర్చిలో ఆదివారం పాస్టర్ చెన్నం డేవిడ్ సుదీప్‌సాగర్ నేతృత్వంలో సంఘం పెద్దలు, స్థానిక ప్రజలు ఆయన మృతికి సంతాపం తెలిపారు. చర్చిలో సండే ప్రార్థన ముగిసిన తర్వాత ఎదురుగా ఉన్న 16వ నంబర్ హైవే సర్వీసు రోడ్డులో ఈ మేరకు ప్రార్థనలు చేశారు. జనుమాల ఆనంద్, సభ్యులు జనుమాల రత్నరాజు, కోడిరెక్క కోటిరత్నం, కొరివి మార్క్, సంఘపెద్దలు కొరివి ప్రసాద్, పుల్లగూర రామారావు, పెద్ద కాంతారావు, బాబు, లాజర్‌బాబు, కిరణ్, జంగా ప్రసన్న, గడ్డం ఎలీషా, కూచిపూడి సమియేలు, మామిడి యాకోబు, స్త్రీల సమాజం, యూత్‌సభ్యులు, సండే స్కూల్ టీచర్లు, పిల్లలు పాల్గొన్నారు.

నిజాలు నిగ్గు తేల్చండి



నరసరావుపేట: పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ నిర్వహించి క్రైస్తవులకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని క్రైస్తవ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం లూథరన్ చర్చి వద్ద నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్లకార్డులు చేతబూని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

ఈద్గాలలో ఏర్పాట్లు పూర్తి



యడ్లపాడు: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు చేపట్టిన ఉపవాస దీక్షలు ఆదివారంతో పూర్తయ్యాయి. సోమవారం ఈద్ ఉల్ ఫితర్‌కు ముస్లింలు సిద్ధం కావాలంటూ అన్ని మసీదుల్లో ఇమాంలు ప్రకటించారు. నమాజ్ కోసం అన్ని ఈద్గాలు సిద్ధమయ్యాయి. చిలకలూరిపేట పట్టణంలో ఉదయం 8 గంటలకు ఈద్గాలకు దువా చేస్తూ హాజరు కావాలని ప్రకటించారు. 8.30 గంటలకు ఈద్గాలో బయాన్ ప్రారంభం అవుతుందని, 9 గంటలకు పండుగ సామూహిక ఖుద్బా నమాజ్ మొదలవుతుందని తెలిపారు. ముస్లిం పర్సనల్ లాబోర్డు పిలుపు మేరకు అన్ని ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు.

ఫ్లెక్సీలు తొలగింపు దుర్మార్గం

- పోలీసులు ఆంక్షలు విధించటం హేయమైన చర్య
- ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించటం దారుణం
- మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ధ్వజం



పోలీసులను నిలదీస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం తిరునాళ్ల సందర్భంగా శావల్యాపురం గ్రామం ప్రధాన కూడలి మార్గంలో వైఎస్సార్ సీపీ నాయకులు సారథ్యంలో భక్తులకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని పోలీసులు పర్యవేక్షణలో తొలగించటాన్ని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఖండించారు. ఆదివారం మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో జరుగుతున్న తిరునాళ్లలో అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. ఫ్లెక్సీ తొలగింపు విషయంపై ఎస్సై లేళ్ల లోకేశ్వరరావును ప్రశ్నించగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నందున తొలగించామని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి పాలన గతంలో ఎన్నడూ చూడలేదని ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తిరునాళ్లలో టీడీపీ నాయకులు ఫ్లెక్సీలు ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన విషయం గుర్తుచేశారు. తిరునాళ్ల వేడుకలకు సైతం రాజకీయ రంగు పులమటం మంచి పద్ధతి కాదన్నారు. మండలంలోని పిచికలపాలెం గ్రామంలో తిరునాళ్లకు ముందు రోజు ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ విద్యుత్ ప్రభపై మాజీ సీఎం వైఎస్ జగన్ పాటలు వేయరాదని పోలీసులు ఆంక్షలు విధించటం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఇలాంటి నీచమైన పనులు చేయటం మినహా పేదలకు సంక్షేమ పథకాలు వంటివి తెలియవన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని అధికార దుర్వినియోగానికి ప్రభుత్వం పాల్పడటం చాలా బాధాకరం అన్నారు. అక్రమ కేసులు బనాయించటం, ఎన్నికల హామీలను ప్రశ్నిస్తే బెదరింపులకు పాల్పడటం కూటమి ప్రభుత్వ వైఖరని తెలిపారు. మండల స్థాయిలో చర్చలు జరగటంతో మళ్లీ సాయంత్రం సమయానికి ఫ్లెక్సీలు కట్టారు. మండల కన్వీనర్ భీమని అంకారావు, సర్పంచ్ మొనపాటి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చెన్నంశెట్టి రంగారావు, మద్దికుంట ఏడుకొండలు, ముంద్రు జీవా, చింతా అంకమ్మ, పాపసాని బ్రహ్మయ్య, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీఅడవి పేరంటాళ్లమ్మ తిరునాళ్ల



అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



అలంకరణలో మూల విరాట్



వైఎస్సార్ సీపీ నేతల విద్యుత్ ప్రభ



విద్యుత్ దీపాలతో ముస్తాబైన దేవాలయం

శావల్యాపురం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని శానంపూడి శివారు గ్రామమైన బొందిలిపాలెంలో వేంచేసియున్న శ్రీ అడవి పేరంటాళ్లమ్మ వారి తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు పొంగించి, అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మొక్కుబడి ప్రభలతో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ సర్పంచ్ చింతా విజయ్‌కుమార్, దేవాదాయ శాఖాధికారి ఎం.సుధాకర్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్‌రావు పర్యవేక్షణలో స్థానిక ఎస్సై లేళ్ల లోకేశ్వరరావు నేతృత్వంలో 200 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కాకతీయ కమ్మ సేవా సమితి, ఆర్యవైశ్య సంఘం, యాదర సంఘం ఆధ్వర్యంలో శావల్యాపురం వాసి దాట్ల వెంకటేశ్వరరాజు భక్తులకు అన్నదానం చేశారు. శ్రీరామా పబ్లిక్ స్కూలు సారథ్యంలో తాగునీరు అందించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ సారథ్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు భక్తులకు ఓఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్లు, అవసరమైన మందులు పంపిణీ చేశారు. శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ భక్తులకు పులిహోర అందజేసింది. డాక్టరు అన్నవరపు వీరాంజనేయులు, జెడ్పీటీసీ సభ్యురాలు పారా హైమావతిలు పులిహోర అందించారు. మండలంలోని మతుకుమల్లి, బొందిలిపాలెం, పిచికలపాలెం, శావల్యాపురం గ్రామాలకు చెందిన వారు విద్యుత్ ప్రభలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మండల వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటరు భీమని అంకారావు, వైస్ ఎంపీపీ చెన్నంశెట్టి రంగారావు, సర్పంచులు మొనపాటి శ్రీనివాసరావు, యలగాల బసవయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యులు మద్దికుంట ఏడుకొండలు పాల్గొన్నారు.

అక్షయపాత్ర వంట గదికి శంకుస్థాపన



భూమి పూజలో పాల్గొన్న ఎంపీ లావు, ఎమ్మెల్యే

నరసరావుపేట రూరల్: అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించే కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. మండలంలోని కేసానుపల్లి సమీపంలో కేంద్రీకృత వంటగది నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీ లావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, అక్షయపాత్ర ప్రాంతీయ అధ్యక్షుడు వంశీధర దాసు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ లావు మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా ఈ ప్రాంతానికి అక్షయపాత్రను తీసుకురావాలని ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. పరిశుభ్రమైన పోషకాహారం మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు అందుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఐదువేల మందికి భోజనాన్ని అందించేలా కిచెన్ నిర్మితం కానుందన్నారు. విస్తరణకు దాతలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎఎం కళాశాల అధ్యక్షుడు ఎంవీ శేషగిరి రావు, నల్లపాటి రామచంద్రప్రసాద్, కపలవాయి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రత్తమ్మ దేవత తిరునాళ్ల

బొల్లాపల్లి: మండలంలోని మేళ్లవాగు గ్రామంలో కొలువుదీరిన రత్తమ్మ దేవత తిరునాళ్లను ఆదివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు చేసి నైవేద్యం సమర్పించి, పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పశుసంపద వృద్ధి చెందాలని పశువులను ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభ కొలువుదీర్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రొంపిచర్లలో ఉద్రిక్తత

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో శనివారం రాత్రి ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఉగాది పర్వదినం, తిరునాళ్ల సందర్భంగా ఇరుపార్టీల వారు ప్రధాన వీధుల్లో ఫ్లెక్సీలు, జెండాలు ఏర్పాటు చేశారు. బుచ్చిబాపన్నపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్తూ రొంపిచర్లలో ఏర్పాటు చేసిన బ్యానర్‌లను చించారు. గమనించిన వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించటంతో ఉద్రిక్తత నెలకొంది. ఇరువర్గాలకు సర్దిచెప్పటంతో సమస్య తాత్కాలికంగా సమసిపోయింది. పోలీస్ అధికారులు బలగాలతో వచ్చి ఇరువర్గాల ఫ్లెక్సీలను, జెండాలను తొలగించారు. ఆదివారం శ్రీ శంకరేశ్వరస్వామి తిరునాళ్లకు ఇరుపార్టీల వారి ప్రభల ఏర్పాటును పోలీసులు అడ్డుకున్నారు. కఠిన ఆంక్షల మధ్య ప్రభలు ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు అంగీకరించారు. ఇరువురు డీఎస్పీల ఆధ్వర్యంలో వందల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కళాకారులకు సత్కారం



సత్కారం అందుకున్న కళాకారులతో ఉషోదయ కళాపరిషత్ అధ్యక్షుడు పిన్నమనేని పాములయ్య

సత్తెనపల్లి: కళలను నైపుణ్యంతో చురుగ్గా ప్రదర్శించే వారే కళాకారులని ఉషోదయ కళాపరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు పిన్నమనేని పాములయ్య అన్నారు. విశ్వావసు నామ తెలుగు సంవత్సరాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ఉషోదయ కళాపరిషత్ ఆధ్వర్యంలో వివిధ రంగాలలో, వివిధ కళల్లో నైపుణ్యం సంపాదించిన కళాకారులు ఎలిశెట్టి వెంకటప్రసాద్, శిఖా ఆదాం, మండ్ల నరసింహ ప్రసాద్‌లను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా పాములయ్య మాట్లాడుతూ కళాకారుల ప్రతిభను కొనియాడారు. ఈ సందర్భంగా ముగ్గురు కళాకారులను పూల మాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కుమ్మరి దస్తగిరి, కళాకారులు మాతంగి సాంబశివరావు, బత్తినేని వెంకట లక్ష్మయ్య, డాక్టర్ సరికొండ రమాదేవి, పాత్తూరి రామకోటయ్య, పిలుట్ల ఆంజనేయులు, సిరిగిరి వెంకట్రావు, తమలపాకుల రవి కిషోర్, కాటుమాల నాగేశ్వరరావు, గుండవరపు అమర్‌నాథ్, గుంటూరు గోవింద్, చింకా అంకమ్మరావు, పిక్కల రత్తయ్య, విప్పర్ల కొండలు, పిక్కిలి శివ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు





రొంపిచర్లలో అలంకరణలో శ్రీ వల్లభేశ్వరస్వామి | వేల్పూరులో అలంకరణలో స్వామి



నూజెండ్లలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



వెల్లటూరులో వేడుకలో ఆర్యవైశ్య ప్రముఖులు

నూజెండ్ల: విశ్వావసు నామ సంవత్సరం తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా మండలంలోని నూజెండ్ల, పమిడిపాడు, గుర్రపునాయుడుపాలెం, కంభంపాడు, అప్పాపురం, రవ్వారం, అయినోవోలు, తదితర గ్రామాల్లో పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం నూజెండ్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీచెన్నకేశవ స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయాల్లో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. తెల్లవారుజాము నుంచి స్వామి వారికి పంచామృత అభిషేకాలు, తదితర పూజలతో పాటు విశేషాలంకరణలు నిర్వహించారు. దేవాలయాల్లో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పూజారి క్రోసూరి రామమోహన్ ఆచార్యులు పంచాంగ చదివి వినిపించారు. ఉగాది పచ్చడి భక్తులకు పంపిణీ చేశారు.

బొల్లాపల్లి: మండల ప్రజలు ఉగాది వేడుకలు సంప్రదాయ పద్ధతిలో ఆదివారం నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వెల్లటూరు గ్రామంలో వాసవి క్లబ్ వైభవ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. పేదలకు వస్త్రాలను అందించారు. ప్రసాద పంపిణీ చేసి పంచాంగ శ్రవణం నిర్వహించారు.

సంప్రదాయబద్ధంగా ఉగాది

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీరాధా గోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. మూలవరులతో కూడిన అంతరాలయాన్ని అత్యంత సుందరంగా అలంకరించారు. అలాగే 1008 రకాల భక్ష్యాలతో మహారాజ భోగనివేదన చేసి భక్తులకు ప్రసాదంగా అందచేశారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉగాది వేడుకల్లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్డీఓ మధులత సంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొన్నారు. గడియార స్తంభం సెంటర్‌లో శ్రీకల్పవల్లి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు మట్టి పాత్రలలో ఉగాది పచ్చడిని ప్రసాదంగా అందించారు. సత్తెనపల్లిరోడ్డులోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో నారాయణం రామాచార్యులు, బరంపేటలోని శ్రీరామచంద్రమూర్తి ఆలయంలో కాసులనాటి నాగరాజశర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు.

శావల్యాపురం: ఉగాది పర్వదినం వేడుకలు మండలంలోని వేల్పూరు, పోట్లూరు, కారుమంచి, మతుకుమల్లి తదితర గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేల్పూరులో వేంచేసియున్న శ్రీవేంకటేశ్వర స్వామి వారిని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దర్శించుకున్నారు. పూజారి మారుతీశర్మ పూజలు నిర్వహించారు. శావల్యాపురంలో కనకదుర్గమ్మ వారి ఆలయంలో భక్తులు పెద్దసంఖ్యలో పూజలు చేశారు.

వినుకొండ: స్థానిక వెల్లటూరు రోడ్డులోని గుమ్మడి వృద్ధాశ్రమంలో ఉగాది పండుగ సందర్భంగా నియోజకవర్గ కళాకారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సాంస్కృతిక విభాగ నిధులు కళాకారులకు అందేలా చూడాలని, దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని ఆలయాల్లో కళాకారులకు అవకాశాలు కల్పించాలని, డీజే సిస్టమ్‌తో మితిమీరిన శబ్ద కాలుష్యాన్ని నివారించాలని తీర్మానించారు. ఐదు మండలాల్లోని కళాకారులకు ఉగాది పురస్కారాలు అందజేసి, సన్మానించారు. సీపీఐ ఏరియా కార్యదర్శి ఎ.మారుతివరప్రసాద్, గుమ్మడి కళాపీఠం అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల: ఉగాది వేడుకలు ఆలయాల్లో వైభవంగా నిర్వహించారు. గణపవరం–నాదెండ్ల డొంక రోడ్డులో కొలువైయున్న శ్రీ నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. పూజారి ఇర్లపాటి వాసు పూజలు నిర్వహించారు. సంకీర్తన సాయి బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నమయ్య గీతాలాపన భక్తులను ఆకట్టుకుంది. చిరుమామిళ్ళ త్రికోటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. సాతులూరు గ్రామంలోని శ్రీ రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయంలో వేడుకల్లో నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. గణపవరం శ్రీ కోదండ రామాలయంలో ఆలయ పూజారులు దర్భి ఉమామహేశ్వరశర్మ, అనిల్ కుమార్‌లు పూజలు నిర్వహించారు.



పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు



సాతులూరులో ఉగాది వేడుకల్లో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

ప్రభల నిర్వాహకులకు సత్కారం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని వాసవి అన్నదానసత్రంలో ఆదివారం ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. కోటప్పకొండ, ఇస్సప్పాలెం తిరునాళ్లలో ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన 50 మందికి కార్యక్రమంలో సత్కరించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, జనసేన నాయకులు గాదే వెంకటేశ్వరరావు, ఎస్ఎస్అండ్ఎన్ కళాశాల అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. అన్నదాన సత్రం కమిటీ కన్వీనర్ బత్తుల మురళి, టీడీపీ మహిళా అధికార ప్రతినిధి కనుమూరి రాజ్యలక్ష్మి, డాక్టర్ షేక్ రహంతుల్లా, మేడికొండ సత్యానందబాబు, చేగు వెంకటేశ్వరరావు, జల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన పంచాంగాన్ని ఆవిష్కరించారు.

ఇఫ్తార్ విందు



విందులో పాల్గొన్న ముస్లింలు, స్థానికులు

శావల్యాపురం వినుకొండ పట్టణంలో శ్రీనివాస నర్సింగ్ వైద్యశాల డాక్టర్ అన్నవరపు వీరాంజనేయులు రంజాన్ పర్వదినం సందర్భంగా మండల కేంద్రం శావల్యాపురంలోని బిలాల్ మసీదులో ఆదివారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. బిలాల్ మసీదు మౌలానా షేక్ అబ్దుల్ రహీం, బోడెపూడి వెంకటేశ్వర్లు, కర్రె పెద అంజయ్య, గుర్రం సుబ్బారావు, దూదేకుల హుస్సేన్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రవేశానికి పిలుపు



జగ్గాపురంలో పంచాంగం వినిపిస్తున్న పి.రంగాచారి

యడ్లపాడు: బ్రాహ్మణులంతా రాజకీయ రంగ ప్రవేశం చేయాలని బ్రాహ్మణ సంఘం నేతలు అభిప్రాయపడ్డారు. ఆదివారం యడ్లపాడు మండలంలోని జగ్గాపురం గ్రామంలో శ్రీ రణవీరాంజనేయస్వామి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన ఉగాది పంచాంగ శ్రవణ కార్యక్రమంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సమాఖ్య ఉపాధ్యక్షుడు వి. ప్రేమ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ కోశాధికారి పి. రంగాచారి పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో చిలకలూరిపేట ఆదిత్య బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి పి. రామచంద్రమౌళి, సమాఖ్య ప్రధాన కార్యదర్శి కాకుమాను హనుమాన్, వి.ఆనంద్ కుమార్, ఎం.హనుమంతరావు, వి. సాయిసత్యనారాయణ, పి.పవన్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు



విరాళం అందిస్తున్న భక్తులు

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లి రోడ్డులోని కోటబజార్ పులుపుల వారి వీధిలోని శ్రీవీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పలువురు భక్తులు విరాళాలను అందించారు. పట్టణానికి చెందిన ఆర్వపల్లి హరివి జయకుమార్, రామ్‌ప్రతాప్‌కుమార్‌లు రూ. 2,01,116, కొత్తూరి శ్రావణ్‌కుమార్, నాగలక్ష్మీ దంపతులు రూ.1,00,116, పులిపాటి వెంకటేశ్వర రుక్మాంగదరావు, వెంకట అనూరాధ దంపతులు రూ.1,01,116, చలువాది వెంకట అయ్యప్ప పృథ్వీరాజ్‌గుప్త, మౌనిక దంపతులు రూ.51,116 విరాళంగా అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వనమా కృష్ణ, కోవూరి శివశ్రీ సుబాబు, వనమా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శంకరస్వామి తిరునాళ్ల



మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో వేంచేసి ఉన్న శ్రీ బాలత్రిపుర సుందరి సమేత శ్రీ శంకరస్వామి తిరునాళ్లను ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు నిర్వహించి స్వామి వారికి నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. గ్రామస్తులు రెండు భారీ విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.







సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నరసరావుపేట డివిజన్

99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)

Office mail : sakshigntadvt@gmail.com